క్లుప్తంగా

దుప్పితూరులో సీతారాముల విగ్రహప్రతిష్ట



దుప్పితూరు శ్రీ సీతారాముల ఆలయంలో ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

అచ్యుతాపురం : మండలంలోని దుప్పితూరులో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. నూతన ఆలయ నిర్మాణంలో భాగంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధనలో భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. ఎమ్మెల్యే కన్నబాబు రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, కూటమి అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్, బీజేపీ నియోజక ఇన్‌ఛార్జ్ రాజాన సన్యాసినాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక



కొండకర్ల గెస్ట్‌హౌస్‌లో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కన్నబాబు

అచ్యుతాపురం : మండలంలోని సెజ్‌కాలనీ దిబ్బపాలేనికి చెందిన పలువురు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. కొండకర్లలో ఉన్న ఎమ్మెల్యే కన్నబాబు గెస్ట్‌హౌస్‌లో వీరు కన్నబాబు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కన్నబాబు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అందే బాబ్జి, గుర్రం సూరిబాబు, కోట దేవుళ్లు, కోట చంద్రరావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ఠారెత్తిస్తున్న భానుడు



నిర్మానుష్యంగా ఉన్న కోటవురట్ల మెయిన్‌రోడ్డు

కోటవురట్ల: భానుడి ప్రతాపంతో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు బాగా పెరగడంతో జనల ఉక్కిరిబిక్కిరవుతున్నారు. భానుడి ప్రతాపానికి ఇల్లు కదలడానికే భయపడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలైతే చాలు అన్ని రహదారులు ఖాళీ అయిపోతున్నాయి. ప్రధాన కూడళ్లు సైతం జన సంచారం లేక నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఎండ వేడిమికి శీతల పానీయాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. జ్యూస్ సెంటర్లు కళ కళలాడుతున్నాయి. కొబ్బరి బొండాలు, పుచ్చకాయల అమ్మకాలు జోరందుకున్నాయి.

పడమటమ్మ లోవలో శాంతి హోమం



పడమటమ్మ లోవలో నిర్వహిస్తున్న హోమం

కశింకోట : మండలంలోని విసన్నపేట వద్ద వెలసి ఉన్న పడమటమ్మ లోవలో సోమ వారం విశ్వ శాంతి, వ్యక్తిగత శాంతి కోసం హోమం నిర్వహించారు. గురువు పెనిమిటి సాంబమూర్తి సంప్రదాయంగా వేద మంత్రోశ్చరణల నడుమ హోమాన్ని జరిపించారు. ఆదివారం కూడా హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌కు ఉచిత శిక్షణ

అనకాపల్లి : గవరపాలెం పార్కు సెంటర్ శ్రీ సత్యసాయి విద్యాలయంలో ఏప్రిల్ 5వ తేదీన సాయంత్రం 4 గంటల నుంచి పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గౌరీ ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల దుర్గాప్రసాద్ తెలిపారు. పార్కు సెంటర్‌లో ఈమేరకు కరపత్రికలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. 28 ఏళ్ల నుంచి పాలిటెక్నిక్, టీటీసీ, బీఈడీ, గ్రామర్ తరగతులు, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తును పార్కు సెంటర్‌లో ఎస్.వెంకటేశ్వరరావుకు ఏప్రిల్ 2వ తేదీలోపు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9247247985 నంబరును సంప్రదించాలన్నారు.



గ్రామ సచివాలయం



రైతు భరోసా కేంద్రం



యండపల్లి గ్రామం

ఇది మా ఊరేనండి..



వెల్‌నెస్ సెంటర్

కోటవురట్ల : గ్రామ స్వరాజ్యం మహాత్మాగాంధీ కలలు కన్న రాజ్యం..దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లైనా, ప్రభుత్వాలు ఎన్ని మారినా మహాత్ముని ఆశయం కార్యరూపం దాల్చలేదు. అన్ని వ్యవస్థలు గ్రామీణులకు చేరువై సుస్థిర పాలన అందినప్పుడే గ్రామ స్వరాజ్యం ఏర్పడినట్టు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అవన్నీ సుసాధ్యమయ్యాయి. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారు. పల్లె పల్లెకూ ప్రభుత్వ కార్యాలయాలన్నీ వచ్చేశాయి. ఏ పని కావాలన్నా గ్రామం విడిచి సుదూరం వెళ్లాల్సిన పనిలేదు. ఉన్న గ్రామంలోనే రైతుకు, విద్యార్థికి కావలసిన ధ్రువపత్రాలు అందుతున్నాయి. ఇంటికే పింఛను డబ్బులొస్తున్నాయి. పల్లెలు పట్టణాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. దీంతో ఆర్థిక కార్యకలాపాలు పెరిగాయి. చిరు వ్యాపారులకు సైతం ఉపాధి దొరుకుతోంది. వ్యయ ప్రయాసలకోర్చి ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పనేలేదు. వలంటీరు వ్యవస్థతో ఆదర్శవంతమైన సేవలు అందుతున్నాయి. ఇవన్నీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్ల సాధ్యమయ్యాయి. మండలంలోని 25 గ్రామ పంచాయతీలు ఉండగా 19 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథాన పరుగులు తీస్తున్నాయి. ఇందుకు యండపల్లి గ్రామమే ఉదాహరణ.

ఐదేళ్లలో ఎంతో మార్పు....

ఇక్కడ ఐదేళ్లలో ప్రజలకు అందిన సంక్షేమాన్ని చూస్తే ఈ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో అవగతమవుతుంది. యండపల్లిలో రూ.25 లక్షలతో సచివాలయం, రూ.21.8 లక్షలతో ఆర్బీకే, రూ.20.8 లక్షలతో వెల్‌నెస్ సెంటర్, రూ.12 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మించారు. ఇవి కాకుండా ప్రభుత్వం నిర్వహించిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో డ్రైనేజీ సమస్యను గుర్తించి పరిష్కారం కోసం మెయిన్‌రోడ్డులో ప్రధాన డ్రైనేజీ నిర్మాణానికి రూ.18 లక్షలు వెచ్చించారు. పిల్లలకు బంగారు భవితను ఇచ్చేందుకు నాడు–నేడులో ఎంపీయూపీ స్కూల్‌ను రూ.25 లక్షలతో అభివృద్ధి చేశారు.

సంక్షేమం...పారదర్శకం

సంక్షేమం విషయానికి వస్తే ఐదేళ్లలో జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా రూ.1.3 కోట్లు, జగనన్న విద్యా దీవెన ద్వారా రూ.49.63 లక్షలు, జగనన్న వసతి దీవెన ద్వారా రూ.18.27 లక్షలు, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.1.93 కోట్లు, వైఎస్సార్ పింఛను కానుక ద్వారా 4.33 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.95.43 లక్షలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.1.69 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ.11.87 లక్షలు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.26.25 లక్షలు, ఇళ్ల నిర్మాణాల ద్వారా రూ.37.66 లక్షలు, ఇలా ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా మొత్తం రూ.11.71 కోట్లు లబ్ధిదారుల అకౌంట్లలో నేరుగా జమ అయ్యింది. ఇంటి స్థలాలు, జగనన్న విద్యా కానుక, జగనన్న తోడు, వైఎస్సార్ కంటి వెలుగు వంటి పరోక్ష ప్రయోజనాల ద్వారా రూ.3.71 కోట్లు లబ్ధి చేకూరింది. సుమారు 1500 ఓట్లు కలిగిన ఓ చిన్న గ్రామంలోనే ఇంత అభివృద్ధిని ఐదేళ్లలో సీఎం జగన్ చేసి చూపించారు.

ఐదేళ్లలో చాలా అభివృద్ధి జరిగింది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ఐదేళ్లలో చాలా అభివృద్ధి జరిగింది. మా ఊళ్లో సచివాలయం, ఆర్బీకే, ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ బిల్డింగ్ కట్టారు. ఈ బిల్డింగులకే చాలా కొన్ని లక్షలు ఖర్చు చేశారు. మెయిన్‌రోడ్డులో ఎన్నో ఏళ్లగా ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. పార్టీ చూడకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

– గొర్లె నానిబాబు, రైతు, యండపల్లి

పింఛను డబ్బులకి పాట్లు తప్పాయి



పింఛను డబ్బులకి పంచాయతీ ఆఫీసు కాడ గంటలు గంటలు కూచునేవాళ్లం. కాళ్లు, ముడుకులు పట్టులు పట్టేసేవి. ఒక్కోసారి ఆఫీసోడు వత్తాడో రాడో కూడా తెలిసేది కాదు. ఇపుడు చాలా బాగుంది. వలంటీరు ఇంటికే వచ్చి డబ్బులు ఇచ్చిపోతున్నాడు. ఒకటో తారీఖంటే ఆ రోజు కచ్చితంగా పింఛను డబ్బులు వచ్చేత్తాయి.

– గుడివాడ వరలక్ష్మి, పింఛనుదారు, యండపల్లి

విత్తనాలకు అవస్థలు లేవు



ఒకప్పుడు విత్తనాలు కావాలంటే కోటవురట్ల ఎళ్లి నానా పాట్లు పడేటోళ్లం. ఎండలో లైనులో నుంచిని ఎదురు చూసేటోళ్లం. ఇపుడో సక్కగా మా ఊళ్లోనే అన్ని రకాల ఇత్తనాలు అందుతున్నాయి. మాకు రైతుల కోసం సెంటర్ పెట్టారు కదా. అందులోనే అన్నీ దొరుకుతున్నాయి. ఎరువులకు కూడా లోటు లేదు. ఏ సమస్య వచ్చినా అన్నీ ఇక్కడే తీర్చేస్తన్నరు.

– గుడివాడ ఎరుకునాయుడు, రైతు, యండపల్లి

మత్స్యకారులను ఆదుకున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం : మత్స్యకారులను అన్ని విధాలా ఆదుకున్నది సీఎం జగన్‌మోహన్‌రెడ్డియే అని పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద పాయకరావుపేట నియోజకవర్గం పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల మత్స్యకార సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మత్స్యకారులను ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు ప్రత్యేక పథకాలు ప్రవేశ పెట్టి వారిని ఆదుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మత్స్యకార సోదరులంతా ఫ్యాను గుర్తుపై ఓటు వేసి పాయకరావుపేటలో తనను, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు, చిక్కాల రామారావు, శీరం నరసింహమూర్తి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మత్స్యకార సంఘ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాసరావు, జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు, నక్కపల్లి జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, వాకపాడు సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, మత్స్యకార సంఘ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలకు అండగా....



నీలిగుంటలో కేంద్ర బలగాలతో కవాతు చేస్తున్న పోలీసులు

కోటవురట్ల: రానున్న ఎన్నికలలో ఓటర్లు స్వేచ్ఛాపూరిత వాతావరణంలో తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలనే భరోసా కల్పించడానికి మండలంలోని పలు గ్రామాలలో పోలీసులు సోమవారం కవాతు నిర్వహించారు. కొడవటిపూడి, కె.వెంకటాపురం, నీలిగుంట, రామచంద్రపాలెం, బి.కె.పల్లి గ్రామాలలో స్థానిక పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి కవాతు చేశారు. నక్కపల్లి సర్కిల్ సీఐ అప్పన్న మాట్లాడుతూ ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఓటర్లు భయపడకుండా శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసులు అండగా ఉంటారన్నారు. ఎక్కడైనా అల్లర్లు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్‌ఐ రమణయ్య, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

నేడు వాడ్రాపల్లిలో పారిపల్లెమ్మ అమ్మవారి పండగ



పారిపల్లెమ్మ అమ్మవారు



వాడ్రాపల్లిలోని పారిపల్లెమ్మ గుడి

మునగపాక: ఉత్తరాంధ్రలో పేరుగాంచిన వాడ్రాపల్లి పారిపల్లెమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవకమిటీ చైర్మన్ కన్నుంనాయుడు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. పండగలో భాగంగా పలు నేలవేషాలు, పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కన్నుంనాయుడు కోరారు. పండగ సందర్భంగా ఎస్‌ఐ పి.ప్రసాదరావు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పేదల పక్షాన వైఎస్సార్‌సీపీ



వృద్ధుడికి ఫ్యాన్ గుర్తు బ్రోచరును ఇస్తున్న అభ్యర్థి కంబాల జోగులు

పాయకరావుపేట: రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ పాలన సాగి స్తుందని, అందుకోసం మనందరం మరలా వైఎస్సార్‌సీపీని గెలిపించి మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలో గల శ్రీరాంపురం శివారు కొత్తూరు గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు గ్రామంలో నాయకులను, ఓటర్లను ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ను పరిచయం చేస్తూ ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా అభ్యర్థి కంబాల జోగులు ప్రచారంలో ఓటర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వృద్ధులకు పింఛన్లు ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే వలంటీర్లతో ఇంటికి పంపించడం జరుగుతుందన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసి అమ్మ ఒడి పథకం ద్వారా ప్రతి విద్యార్థి తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తున్నారన్నారు. ఈబీసీ నేస్తం, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకం అమలు చేస్తున్నారన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం మంజూరు చేసి, ఇంటి నిర్మాణానికి రుణం కల్పించి, సొంత ఇంటి కల నేరవేర్చారన్నారు. అదే విధంగా ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు. రైతులకు రైతు భరోసా, విద్యాదీవెన, వసతిదీవెన, విద్యాకానుక, ఆసరా, చేయూత, కాపు నేస్తం వంటి పథకాలు మహిళల పేరునే పెట్టి, మహిళల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు యధా ప్రకారం కొనసాగాలంటే మరలా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అంతకుముందు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళిలర్పించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసనరపు పార్వతీ తాతారావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, మేడిశెట్టి రామగోవిందు, వంగలపూడి రామారావు, చేపల తాతాజీ, గోసల రమణ, బీసీ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పక్కుర్తి లోవ, బోడపాటి గోవిందు, ఎంపీటీసీలు పులగల రాఘవ, పల్లేల లక్ష్మణ్, యగదాసు శేఖర్, కాధా రామకృష్ణ, గారా చక్రవర్తి, కొంతం నరేష్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దేవవరపు వెంకటేశ్వరరావు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కొంకిపూడి రామకృష్ణ, ఎంఎల్‌వో కాకాడ కృష్ణ, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి వేమగిరి లక్ష్మణ్, సీనియర్ నాయకులు కోనే పుత్రరావు, గూటూరు వెంకటేశ్వరరావు, పల్లేల కృష్ణార్జునరావు, పల్లేల వెంకట్, తూము రమణ, మహిళ విభాగం బొడ్డా శ్రీదేవి, పులి సీతారత్నం, కొంతం వరలక్ష్మి పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైతసిద్ధాంతం భగవద్గీత ప్రచారం చేస్తున్న సభ్యులు

తుమ్మపాల: పాల్గుణ మాసంలో పౌర్ణమి నాడు నిర్వహించే హోలీ పండగలో ఆధ్యాత్మికత ఉందని త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి, ఇందూ జ్ఞానవేదిక ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. హోలీ పండగను పురస్కరించుకుని పట్టణంలో త్రైత సిద్ధాంత సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శారదానగర్ త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతలో చాతుర్వర్ణము అని మనుషుల గుణాలను బట్టి, స్వభావాన్ని బట్టి తామసులు, రాజసులు , సాత్వికులు, యోగులు అని నాలుగు రకాలుగా వర్ణించారన్నారు. ఇక్కడ వర్ణము అంటే మనిషి స్వభావం అని అర్థం అని చెప్పారు. ఇందులో శ్రేష్టమైనది యోగ,జ్ఞాన మార్గమన్నారు. యోగము అనే వర్ణములోకి అందరూ రావాలి యోగులుగా జ్ఞానులుగా మారాలనే ఉద్దేశంతో దైవరంగును పూసుకోవడమే హోలి రంగులు చల్లు కోవడం అన్నారు. ప్రతి ఒక్కరూ జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరం తెలుసుకుంటే దైవరంగును జ్ఞానవర్ణంను అందరూ పూసుకుంటే హోలీ జరుపుకొన్నట్లే అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అప్పారావు, రమణ, విజయ్, అరుణ్, మంగ,లక్ష్మి, మనీమ, శ్రేయ, పద్మ, కన్యక, మల్లేష్, మోహన్ పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో రంగుల హోలీ



దిమిలిలో రంగులు పూసుకొని సందడి చేసిన చిన్నారులు, యువకులు



డావెన్సీ పాఠశాలలో హోలీ వేడుకలు

కోటవురట్ల: మండలంలో హోలీ పండగను సోమవారం ఉత్సాహంగా జరుపుకొన్నారు. పలు గ్రామాల్లో యువకులు రంగులతో సందడి చేశారు. ఈ హోలీ ప్రతి ఒక్కరి జీవితాలలో కొత్త వెలుగులు నింపాలని కోరుకుంటూ రంగులు జల్లుకున్నారు. చిన్నారులు సైతం పరుగులు తీస్తూ దొరికిన వారికి రంగులు పులుముతూ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

రాంబిల్లి: మండలంలో దిమిలిలో పలు వీధుల్లో హోలీ సందర్భంగా సందడి వాతావరణం కనిపించింది. యువకులు, చిన్నారులు, యువతులు రంగులు పూసుకొని ఆనందంగా హోలీ జరుపుకొన్నారు. పలువురు హోలీ విశిష్టతను చిన్నారులకు వివరించారు.

మునగపాక: తిమ్మరాజుపేట డావెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లలు రంగులు వేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందరయ్య మాట్లాడుతూ హోలీ పండగ చెడుపై నుంచి సాధించిన విజయమన్నారు. పాఠశాల డైరెక్టర్ జె.రమణాజీ, హెచ్‌ఎం మీన మిత్ర,డీన్ సూరిబాబు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

ఎస్.రాయవరం : మండలకేంద్రంతో పాటు తిమ్మాపురం, కొరుప్రోలులో చిన్నారులు పెద్ద ఎత్తున గుమిగూడి హోలి సందర్భంగా రంగులు జల్లుకుని సందడి చేశారు.

హాట్ సమ్మర్‌లో కూల్ కూల్‌గా...



యలమంచిలి ప్రధాన రహదారి పక్కన అమ్మకానికి సిద్ధం చేసిన పుచ్చకాయ ముక్కలు



వేసవితాపం నుంచి ఉపశమనం కోసం కొబ్బరినీళ్లు తాగుతున్న యువకుడు

యలమంచిలి రూరల్ : రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. వేసవి తాపం నుంచి చల్లబడేందుకు పండ్ల రసాలు, శీతల పానీయాలు, కొబ్బరిబోండాలు, నిమ్మకాయ సోడా స్టాళ్లను జనం ఆశ్రయిస్తుండడంతో చల్లని వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. పలు కూడళ్లలో, ప్రధాన రహదారుల పక్కన ఆయా అమ్మకాలు జోరందుకున్నాయి. అలాగే పుచ్చకాయలు, కర్బూజా పండ్ల అమ్మకాలకు డిమాండ్ పెరిగింది. వేసవితాపం నుంచి ఉపశమనం పొందడానికి పలువురు స్విమ్మింగ్ పూల్స్, నదులు, చెరువుల్లో ఈత కొడుతున్నారు. అలాగే పేదోడి ఫ్రిడ్జ్‌గా భావించే మట్టి కుండలు, కూజాల అమ్మకాలు కూడా పెరిగాయి. అయితే కష్టాన్నే నమ్ముకుని ఎండను సైతం లెక్కచేయకుండా వ్యాపారులు వినియోగదారులకు చల్లదనం అందిస్తున్నారు. యలమంచిలి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నలువైపులా ప్రధాన రహదారుల్లో ప్రత్యేక జ్యూస్ స్టాళ్లు, పలు దుకాణాలు వెలిశాయి.



గాంధీనగరం ప్రధాన రహదారిలో కర్బూజా పండ్ల విక్రయాలు